విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

19న కలెక్టరేట్ల ఎదుట చేనేత కార్మికుల ధర్నా

విశాలాంధ్ర-పెడన : చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 19న కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించాలని చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు ఇచ్చిందని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టా హేమసుందరరావు తెలిపారు. పెడన పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత పరిశ్రమను పూర్తిగా నిర్వీర్యమైన నేపథ్యంలో రాష్ట్రంలోని ఆరు చేనేత కార్మిక సంఘాలు ఐక్యమై ఆందోళన నిర్వహిస్తున్నామని అన్నారు. 2017 నుంచి ఆప్కో సహకార సంఘాల నుండి కొనుగోలు చేసిన వస్త్రాలకు ఇప్పటివరకు బిల్లులు చెల్లించలేదని ఫలితంగా సంఘాలు ఆర్థికంగా దివాలా తీసే స్థితికి చేరుకున్నాయని ఆయన అన్నారు. ఈ సమావేశంలో చేనేత కార్మిక సంఘాల నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ, పంచల రామ నరసింహారావు, నందం చంద్రకళ, బూసం బాలసుబ్రమణ్యం, రావూరి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వరి వంగడాల కొనుగోళ్లు ప్రారంభం

విశాలాంధ్ర-కూచిపూడి : భారతీయ సంస్కృతికి, జీవన విధానానికి మూలాధారమైన వ్యవసాయం పనులను పలువురు రైతులు ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎద్దులతో అరక (నాగలి) కట్టి భూమి పూజ, పశువుల పూజ చేసుకుని పొలాలను దున్నుకునే ప్రక్రియను చేపట్టారు. కాజ, కూచిపూడి, పెదపూడి, తదితర ప్రాంతాలలో పొలాలను దున్నుకొని నవధాన్యాలను, పచ్చిరొట్ట విత్తనాలనుచల్లి వ్యవసాయ పనులు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల్లోని పలువురు రైతులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ముందస్తుగా నారు పోసుకోవడానికి వీలుగా 150 రోజులు పంటకు అనువైన విత్తనాలు ఎం టి యు 1061, 2077, 1318, 22 31, 1075 పై దృష్టి సారించారు.

మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర-కూచిపూడి : వేసవి అధిక ఉష్ణోగ్రతల నుంచి ప్రజల దాహార్తి తీర్చేందుకు మొవ్వ మండల అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో కూచిపూడి సెంటర్లో ఆదివారం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. తొలుత కృష్ణాజిల్లా పరిషత్ సభ్యులు వేమూరిపరిశుద్ధ రాజు, సీపీఐ పామర్రు నియోజకవర్గ కార్యదర్శి దగాని సంగీతరావు సెంటర్‌లోని బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. వేసవి ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు, బాటసారులకు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వారిద్దరితోపాటుఅంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గన్నవరం ప్రభుత్వ పాలిటెక్నికల్‌లో కంప్యూటర్ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్ కోర్సులు

విశాలాంధ్ర-గన్నవరం : దావాజీగూడెంలో గుర్తింపు పొందిన పాలిటెక్నికల్ కాలేజీలో కొత్తగా కంప్యూటర్ ఇంజనీరింగ్ మరియు ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ అండ్ ఇంజనీరింగ్ కోర్సులు ప్రవేశపెడుతున్నామని ప్రిన్సిపల్ అట్లూరి పద్మావతి తెలిపారు. 23 సంవత్సరం ఈ కోర్సులు ప్రారంభిస్తున్నామని విద్యార్థులు కోర్సులు 60 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఆ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ కోర్సులు రెండు కొత్త కోర్సులు అందుబాటులో తీసుకొస్తున్నామని తెలిపారు.

బైక్‌లు ఢీ-ఒకరి మృతి

విశాలాంధ్ర-కృత్తివెన్ను : 216 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటన కృత్తివెన్ను పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఎస్ఐ గణేష్ కుమార్ వివరాల ప్రకారం లక్ష్మీపురం నుండి బంటుమిల్లి వైపు బైక్‌పై వెళుతున్న వ్యక్తిని ఎదురుగా వస్తున్న మోటార్ బైక్ ఢీకొనడంతో యండపల్లి గ్రామానికి చెందిన జన్యావుల తులసీరావుకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన వ్యక్తిని 108లో బందరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ ఆయన మృతి చెందారు. ప్రమాదంలో మరణించిన వ్యక్తికి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

తల్లిదండ్రులు చదువుకు ఒత్తిడి చేయకండి

విశాలాంధ్ర-పమిడిముక్కల: తల్లిదండ్రులు చదువుతున్న విద్యార్థులు కు వత్తిడి చేయకూడదని పమిడిముక్కల ఎస్.ఐ. కె.సత్యనారాయణ అన్నారు.ఆదివారం ఐనంపూడి గ్రామంలో ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన సుంకర నాగ అక్షయకు రూ.10 వేల నగదు బహుమతి మెమెంటో తో సత్కరించారు. ఈ సందర్భంగా భట్లపెనుమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్.సుబ్రమణ్యం మాట్లాడుతూ విద్యార్థులు కు తల్లిదండ్రులు గ్రామస్తులు ప్రోత్సాహం ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ యేనుగ బేబి కమిటీ అధ్యక్షులు కొల్లి వెంకట ప్రసాద్ కార్యదర్శి జొన్న రమేష్ ఉపాధ్యక్షులు శీలం మురళి కోశాధికారి కొల్లి చందు సభ్యులు టి.నాగరాజు కె.నరసింహ రావు టి.నాగ సురేష్ విశ్రాంత ఉపాధ్యాయులు కొల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు హామీలు ప్రజలు నమ్మరు

విశాలాంధ్ర-చల్లపల్లి : చంద్రబాబు హామీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, ఎన్నికల హామీలు ఏ విధంగా అమలు చేస్తారో రాష్ట్ర ప్రజలకు తెలుసనీ అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. చల్లపల్లి గ్రామ సచివాలయం -4 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం ఆదివారం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు వివరించారు. మీడియాతో మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన రోజు నుంచే అమలు చేస్తే, గతంలో చంద్రబాబుకు ఎన్నికలు ముందు హామీలు గుర్తుకు వచ్చాయన్నారు. రాష్ట్ర ప్రజలు జగన్మోహనరెడ్డిపై విశ్వాసంతో మరోసారి గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

యలమర్రులో గంగానమ్మ ఆలయం ప్రారంభం

విశాలాంధ్ర-పెదపారుపూడి : యలమర్రు గ్రామంలో గంగానమ్మ నూతన దేవాలయమును గ్రామస్తులు సహకారంతో శనివారం నిర్మించి ప్రతిష్టించినట్లు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, మండల ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ గుడి ప్రతిష్టకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న టిడిపి పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఉత్సవాలు జరుపుకుంటూ ప్రస్తుతం గ్రామస్తుల సహకారంతో ప్రత్యేక భవనం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలతో ప్రారంభించినట్లు వర్ల వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ సూరపనేని వెంకట సత్యనారాయణ, నాయకులు చెరుకూరి విజయ్ కుమార్, సుమారు 5000 మంది అన్న సమారాధనలో పాల్గొన్నారు.

గేదలు మృతి

విశాలాంధ్ర-తిరువూరు: స్థానిక పోతుల చెరువు సమీపంలో ఆదివారం తెగిపడిన విద్యుత్ తీగలు తాకి పాడిగేదలు మృతి చెందాయి. పాత తిరువూరుకు చెందిన పెగళ్లపాటి సీతారామయ్యకు చెందిన మూడు పాడిగేదలు మేతకు వెళ్లి చెరువు సమీపంలో విద్యుత్ ఘాతానికి గురయ్యాయి. వీటి విలువ సుమారు రూ. లక్షా 50వేలు ఉంటుందని సీతారామయ్య తెలిపారు.

6న కేంద్ర మంత్రి రాక

విశాలాంధ్ర-తిరువూరు: కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి భారతి పవర్ ఈనెల 6న తిరువూరు నియోజకవర్గంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. ఏ కొండూరు లో కిడ్నీ బాధితులను పరామర్శించడంతో పాటు తిరువూరు బైపాస్ రోడ్ లోని అమరావతి ఆసుపత్రిలో కార్డియాక్ విభాగాన్ని ప్రారంభిస్తారని కోనేరు కృష్ణ తెలిపారు.

రైతులను మోసం చేస్తున్న
వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : మండలం పరిధి చిన్నాపురంలో మాజీమంత్రి కొల్లు రవీంద్ర, మాజీ పార్లమెంట్ సభ్యులు, కొనకళ్ళ నారాయణరావు, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, పొలంలో పూజలు చేసి దుక్కి దున్ని ఏరువాక కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించి, రైతులను ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ రైతు సమస్యలకు శాశ్వత పరిష్కారం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం అన్నారు. రైతుల సుభిక్షతే నా లక్ష్యం అంటూ రైతు కోసం అహర్నిశలు తపించే నారా చంద్రబాబు నాయుడు త్వరలో రైతు ప్రభుత్వాన్ని స్థాపించి రైతులకు రైతు సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపించనున్నారని అన్నారు. ఇప్పటికే మహానాడులో రైతులకు ఆర్థికపరమైన భరోసాను ఏడాదికి 20వేల రూపాయలు పెట్టుబడి రూపంలో ఇవ్వడం జరుగుతుందని ప్రకటించారు. రాబోయే దసరాకు పూర్తిస్థాయిలో రైతు మేనిఫెస్టో ప్రకటించి రైతులకు రైతు సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపించబోతున్నారు రాబోయేది రైతుల ప్రభుత్వం. రైతు ప్రభుత్వంలో ఈ భరోసా కేంద్రాల దగ్గర పడిగాపులు కాసే పరిస్థితులు ఉండవు ధాన్యంతోలి రావాల్సిన డబ్బులు కోసం కళ్ళల్లో వత్తులు పెట్టుకొని ఎదురు చూసే అవసరం ఉండదు. అప్పులు చేసి, వడ్డీలకు తీసుకొని, మహిళల పుస్తెలు తాకట్టు పెట్టి చివరకు వాటిని తీర్చలేక మానసిక బాధతో ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు ఉండవు. ఈ వైసీపీ ప్రభుత్వం రైతులకు ధాన్యం బకాయిలు కూడా సరిగా చెల్లించటం లేదు అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న పరిస్థితి, ఎన్నిసార్లు ఎంతమంది వైసీపీ ప్రభుత్వం దృష్టికి రైతుల సమస్యలు తీసుకువెళ్లిన చీమకుట్టినట్లు కూడా ఈ వైసీపీ ప్రభుత్వానికి లేదు అన్నారు. దేశానికి రైతులే వెన్నుముక అని కొనకళ్ళ నారాయణ రావు స్పష్టం చేశారు. తెలుగునాట ఏరువాక పున్నమి వ్యవసాయదారులకు ఎంతో ప్రీతికరమైన రోజు.. ఏరువాక పున్నమి ప్రతి సంవత్సరం జ్యేష్ఠ పూర్ణిమనాడు రైతులందరూ ఈ పండుగను జరుపుకుంటారని, 'ఏరు' అంటే ఎడ్లను కట్టి దున్నడానికి సిద్ధపరచిన నాగలి, 'ఏరువాక' అంటే దుక్కి ప్రారంభ దినం అని, అన్నారు. రైతులకు ధాన్యం బకాయిలు తక్షణమే చెల్లించాలని, పండిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కూడా ఈ వైసీపీ ప్రభుత్వం విఫలం అయింది అన్నారు. మన కోసం మన రైతుల కోసం రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కష్టపడే నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో రైతులకు పెద్దపీట వేసి రైతే రాజుగా ముందుకెళ్లడం జరుగుతుందన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో రైతు రుణమాఫీలు, సబ్సిడీపై యాంత్రీకరణ పరికరాలు, ఎరువులు, సూక్ష్మ పోషకాలు, పంటల బీమాలు ఇలా ఎన్నో రకాలు గా రైతులను ఆదుకుంటే వైసీపీ ప్రభుత్వం రైతులను విస్మరించింది అని మండిపడ్డారు. చంద్రబాబు మహానాడులో రైతులకు చక్కటి మేనిఫెస్టోని ప్రకటించారని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే రైతు సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ, మాజీ ఎం.పి.పి. కాగిత వెంకటేశ్వర రావు, మాజీ జెడ్పీటీసీ లంకే నారాయణ ప్రసాద్, సర్పంచ్ గోపాల రావు, క్లస్టర్ ఇంఛార్జి లంకే శేష గిరి రావు, తలారి సోమ శేఖర్, తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా ప్రచార కార్యదర్శి, పి.వి ఫణి కుమార్, వక్కపట్ల శ్రీనివాస్, గుమ్మడి విద్యాసాగర్, కార్పొరేటర్ దేవరపల్లి అనిత మహిళా అధ్యక్షురాలు లంకి శెట్టి నీరజ కరెడ్ల సుశీల నాగరమేష్ రాజులపాటి సత్యనారాయణ లుక్కా సాయిరాం గౌడ్, తూమాటి బసవ శంకరరావు, అని శెట్టి రామకోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గుండె చప్పుడు అమూల్యమే..

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ప్రతి గుండె చప్పుడు అమూల్యమైనదని, గుండె వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రఖ్యాత గుండె శస్త్రచికిత్స నిపుణులు, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ ఎ. గోపాలకృష్ణ గోఖలే అన్నారు. నగరంలో నూతనంగా నెలకొల్పిన డాక్టర్ శివప్రసాద్ హృదయాలయను ఆదివారం ఆయన ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు, వైసీపీ తూర్పు నియోజకవర్గ ఇంచార్జి దేవినేని అవినాష్, నగర డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, జెడ్పీ మాజీ చైర్ పర్సన్ గద్దె అనురాధ తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే మాట్లాడుతూ, గుండెపోటు లక్షణాలను గుర్తించిన వెనువెంటనే వైద్య చికిత్స తీసుకోవాలని అన్నారు. అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు, అత్యాధునిక సాంకేతిక వసతులతో శివప్రసాద్ హృదయాలను స్థాపించడం అభినందనీయమని ప్రశంసించారు. హాస్పిటల్ అధినేత డాక్టర్ పి.వి. శివప్రసాద్ మాట్లాడుతూ, గడచిన 18 సంవత్సరాలుగా కోస్తాంధ్ర ప్రజలకు మెరుగైన హృద్రోగ చికిత్సలను అందిస్తున్నామని తెలిపారు. క్రిటికల్ కేర్ విభాగంలో డాక్టర్ జస్వంత్ చౌదరి, సర్జన్లు డాక్టర్ ప్రశాంత్ ప్రభు, డాక్టర్ దిలీప్ తదితర అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు సేవలందిస్తున్నారని చెప్పారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ కాస్మెటిక్ డెంటల్ సర్జన్ డాక్టర్ ఎన్.ఆర్. శిరీష, బ్లూ బెల్ ఎండీ ఘంటా శివ సీతారాం, విటెస్కో టెక్నాలజీ ఎస్ఏపీ కన్సల్టెంట్ ఎన్. వినయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి బుద్ధి చెప్పండి
మాజీ ఎమ్మెల్యే రావి

విశాలాంధ్ర-గుడివాడ : రైతు బాగుంటేనే మన దేశం, రాష్ట్రం బాగుటుందని, కానీ నేడు వైసీపీ ప్రభుత్వం పౌర్ణమి ఏరువాకను పూర్తిగా వదిలి రైతుల పూర్తిగా విస్మరిస్తునరని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం రూరల్ మండలంలోని బొమ్ములూరు గ్రామంలో పౌర్ణమి ఏరువాక సందర్భంగా రైతు సోదరులకు ఏరువాక శుభాకాంక్షలను తెలిపి వ్యవసాయ పరికరాలకు ప్రతేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వైసీపీ ఉండగా వ్యవసాయం దండగ అంటుందన్నారు. ఏరువాక పౌర్ణమి రాగానే రైతు సోదరులందరూ వ్యవసాయ పనులు చేపట్టడం అనాదిగా మన సాంప్రదాయంగా వస్తుంది కానీ ఈ వైఎస్ఆర్ రాక్షస పరిపాలన వచ్చిన తర్వాత విత్తనం నుంచి విక్రయం వరకు రైతులను ఎన్నో రకాలుగా దోచుకుంటూ, వైసిపి ఉండగా వ్యవసాయం దండగ అనే విధంగా తయారుచేసిందన్నారు. ధాన్యం అమ్మిన రైతన్నలకు ఐదారు నెలలు అయినా ఇంకా డబ్బులు పడని పరిస్థితి నెలకోందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రైతు ఇబ్బంది పడకూడదని రేపు తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడంగానే అన్నదాత అనే పథకం ద్వారా రైతులకు ప్రతి ఏటా రూ.20 వేలు ఇచ్చి వారిని ఆదుకోవడమే కాకుండా ఒక పద్ధతి ప్రకారం విత్తనాలు, ఎరువులు అందించడం, పండిన ధాన్యాన్ని మద్దతు ధర 21 రోజుల్లోపు రైతుకి దాన్యం డబ్బు చెల్లించటం ద్వారా రైతుకి వ్యవసాయం పండగ చేయడమే తెలుగుదేశం పార్టీ సిద్ధాంతమన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్షులు వాసే మురళి, ప్రధాన కార్యదర్శి అంగడాల వీర్రాజు, నాయకులు శొంఠి నాగేశ్వర రావు, అంగడాల శ్రీను, అట్లూరి రమణప్రసాద్, చంద్రాల చిట్టిబాబు, గోర్జి సత్యనారాయణ, గోకవరపు సునీల్ పంద్రాజు సాంబశివరావు, పాలసి ఉమా, దారపురెడ్డి మణేశ్వరరావు, రెడ్డి అప్పారావు, మధ్యాహ్న నాగరాజు, వసంతవాడ దుర్గారావు, కంచర్ల సుధాకర్ ,శొంఠి రామకృష్ణ షేక్ జానీషరీఫ్, మోహన్, మంగరాజు, పాండు, జగన్, గోవాడ శివ, నేరుసు కాశి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఆనందహేళ ఏరువాక పండుగ

విశాలాంధ్ర-బంటుమిల్లి :- ఏరువాక పూర్ణిమ, రైతులకు, వ్యవసాయానికి తొలి, అతి ముఖ్యమైన పండుగ అని అనాది కాలం నుండి ప్రాచుర్యం, ప్రాముఖ్యత ఉందని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం నుండి వ్యవసాయ పనులను అనందోత్సవాలతో రైతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన గౌరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగం తీవ్రసంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందన్నారు. మండల రైతు సంఘ కార్యదర్శి అజయ్‌ఘోష్ మాట్లాడుతూ రైతులు కష్టపడి పంటలు పండించడం, అమ్ముకోవడం, డబ్బులు రావడం ఆలస్యంగా వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు జాజుల నాగరాజు, తలారి నాంచారయ్య ,సుంకర వెంకన్న గౌరిశెట్టి రమేష్ ,సుంకర నాగమల్లేశ్వరరావు, నాగిశెట్టి చంద్రశేఖర్, బొడ్డు నాగరాజు, ఎలవర్తి కృష్ణమూర్తి తదితర రైతులు పాల్గొన్నారు.

నేడు మంత్రివర్గ ఉపసంఘంతో ఉద్యోగ సంఘాల భేటీ

విశాలాంధ్ర-విజయవాడ : సాధారణ పరిపాలనా విభాగం నుండి అందిన సమాచారం మేరకు సోమవారం సాయంత్రం 4.30 గంటలకు మంత్రి వర్గ ఉపసంఘంతో పర్మనెంట్ ఉద్యోగ సంఘాలతో వెలగపూడి సచివాలయం లోని 2వ బ్లాక్ మొదటి అంతస్తులో ఆర్థిక శాఖ సమావేశ మందిరంలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసినట్లుఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, కార్యదర్శి పలిశెట్టి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ జేఏసీ అమరావతి గతకొన్ని రోజులుగా చేస్తున్న ఉద్యమ ఫలితంగా ఈ నెల ఒకటో తేదీన అనేక శాఖాపరమైన డిమాండ్లపై సీఎస్ దాదాపు మూడు గంటలపాటు ఏపీ జేఏసీ అమరావతి నాయకత్వంతో అనేక దీర్ఘకాలిక శాఖాపరమైన అంశాలపై సానుకూలంగా చర్చించిన సంగతి విదితమే. ప్రధానమైన ఆర్థిక అంశాలు అనగా పాత 1.7.2018 నుండి 1.7.2021 వరకు చెల్లించాల్సిన డీఏ, అరియర్స్, పీఆర్సీ, పే స్కేల్స్, కొత్త పీఆర్సీ కమీషనర్ నియామకం తదితరాల చర్చించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే సదరు ప్రధానమైన ఆర్థిక అంశాలపై ప్రభుత్వం నుండి స్పష్టత వచ్చే వరకు ఉద్యమం కొనసాగుతుందని, 8వ తేదీన ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో గుంటూర్లో నాలుగవ ప్రాంతీయ సదస్సు కూడా యదావిధిగా జరుగుతుందని స్పష్టం చేశారు.

కష్టపడి చదివితే విజయం తధ్యం : డీఎస్పీ మురళీధర్

విశాలాంధ్ర-చల్లపల్లి : జీవితంలో కష్టపడి చదివితే విజయం తథ్యమనీ, భవిష్యత్తుకు మంచి ప్రణాళికలు వేసుకుని విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అవనిగడ్డ డీఎస్పీ కె. మురళీధర్ తెలిపారు. చల్లపల్లి రాజా కళాశాల పూర్వవిద్యార్థుల అసోసియేషన్ (1987 - 2020 బ్యాచ్) ఆధ్వర్యంలో చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల మండలాల ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో పదవ తరగతి ఫలితాల్లో పాఠశాల స్థాయిలో ప్రథమస్థానం సాధించిన 23మంది విద్యార్థినీ, విద్యార్థులకు సన్మాన కార్యక్రమం స్థానిక శ్రీఆర్యవైశ్య సంఘ భవనంలో ఆదివారం జరిగింది. విద్యార్థినీ, విద్యార్థులను తల్లిదండ్రులతో కలిసి సన్మానించి, రూ.రెండు వేల చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతి, జ్ఞాపికలు అందచేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ మురళీధర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించేలా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. కృష్ణాజిల్లా ఎందరో మహనీయులకు పుట్టినిల్లన్నారు. కృష్ణాజిల్లా నుంచీ సుప్రీంకోర్టు సీజేఐగా ఎదిగిన జస్టిస్ ఎన్వి.రమణ, న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్, ఐఏఎస్ అధికారి రేవు ముత్యాలరాజుల గురించి వివరించారు. విద్యార్థులు వారిని స్ఫూర్తిగా తీసుకుని చదువులో రాణించాలని కోరారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించుకోవాలని సూచించారు. ఇంటర్లో విద్యార్థులు తమ దృష్టిని కేవలం చదువు, లక్ష్యసాధనపైనే ఉంచాలన్నారు. విజయవాడ పీబీ.సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ మేకా రమేష్ మాట్లాడుతూ, టెన్త్ టాపర్లు ఇదే టెంపో కొనసాగిస్తూ ప్రతి పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించాలనీ, తెలివితేటలు ఉన్న విద్యార్థులు కూడా పదే పదే సబ్జెక్టు చదువుతూ ఉన్నప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించటం సాధ్యమన్నారు. లక్ష్యసాధనకు కఠినంగా శ్రమించాలనీ, ఒకవేళ లక్ష్యాన్ని సాధించలేకపోయినా ఎప్పటికీ నిరాశ చెందకుండా ప్రయత్నం కొనసాగించాలన్నారు. విశ్రాంత ప్రిన్సిపాల్ టి.సాంబశివరావు పర్యవేక్షణ, పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడుజి.అశ్వినీ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు బీడీఆర్, నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, ఎండి.ఎకె. జిలానీ, కొండవీటి నాగరాజు, సిహెచ్.అనిల్, పాగోలు దుర్గాప్రసాద్, ఉప్పాల నాంచారయ్య, సుభాషిణి, రావి రాజశేఖర్, సాయికుమారి, ఓగిరాల నాగమల్లేశ్వరరావు, బి.నాగమల్లేశ్వరరావు, మాలెంపాటి శ్రీను, వేములపల్లి అనిల్, అంబటి భువనేశ్వరరావు, సిహెచ్. మహేంద్ర, మణికాంత్, సాజీర్, గౌతమ్, చేతన్, నిరంజన్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు. ఆర్యవైశ్య ప్రముఖులు కొల్లిపర మధు, వరదా హరిగోపాల్, తమ్మన సతీష్ కుమార్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మూడు మండలాల్లో మండల స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థులకు లయన్ క్లబ్ నేత కొల్లిపర మధు రూ.1000 చొప్పున నగదు బహుమతి అందించారు.

వేసవి శిక్షణ శిబిరాలు

విశాలాంధ్ర-గంపలగూడెం : గంపలగూడెం, పెనుగొలను శాఖ గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులకు నిర్వహించారు. పెనుగలను శాఖ గ్రంథాలయంలో ఆదివారం నాడు భాగవతం మరియు బొమ్మ కథలు చదివించి చెప్పించడం జరిగింది. అంతర్జాతీయ పీడిత బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. బాలసుబ్రమణ్యం జన్మదినం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఉమ్మ. శేశిరెడ్డి, షిరిడి సాయి సేవా సమితి సభ్యులు నారాయణరావు, ఉపాధ్యాయులు నాగరాజు, గ్రంథాలయ అధికారిని వి. జ్యోతిర్మయి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు . స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయులు క్రాంతి కుమార్ విద్యాపటన ము గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఏరువాక పున్నమికి నాగలి పట్టిన మండలి

విశాలాంధ్ర-మోపిదేవి : మండల పరిధిలోని బొబ్బర్లంక గ్రామంలో ఏరువాక పౌర్ణమిని రైతులు ఆనందోత్సాహాల నడుమ మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. పొలాల్లో భూమి పూజ నిర్వహించి, నాగలితో దుక్కిదున్ని వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మండలి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ నాగరికత ఎంత మారినా నాగలి లేకుండా వ్యవసాయం జరగదని, రైతు లేకుండా పూట గడవదని అన్నారు. ప్రతి ఏడాది జ్యేష్ఠ పూర్ణిమ నాడు అన్నదాతలు ఎడ్లు, నాగలి, ఇతర వ్యవసాయ పనిముట్లకు పూలు, పసుపు, కుంకుమ, ధూప దీపాలు మొదలైనవాటితో పూజించి, దుక్కి దున్నడంతో ప్రారంభించి, వ్యవసాయ పనులలో ఎటువంటి ఆటంకాలు లేకుండా మంచి పంటలు పండాలని భగవంతుని కోరుకుంటూ వ్యవసాయ పనులు ప్రారంభించడం ఆనవాయితీగా వస్తున్న సాంప్రదాయం అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఈ ఏరువాక పూర్ణిమ పర్వదినాన్ని ఎంతో గొప్పగా జరిపేవారమని, ఈ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను అబద్ధపు మాటలతో మోసగించటం సరిపోతుంది అన్నారు. అనంతరం పసుపు, మొక్కజొన్న పంట వేసి నష్టపోయిన రైతులు మండలి ఎదుట తమ ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పంటకు మద్దతు ధరను ఇవ్వకుండా ప్రభుత్వం తమని ఇబ్బంది పెడుతోందని, రైతు భరోసా కేంద్రాలలో పేరు నమోదు కోసం వెళ్తే కులం ఏమిటని అడుగుతున్నారని, రైతుకు కులం ఏమిటో అర్థం కావడం లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్, మోపిదేవి మండల ఎంపీపీ రావి దుర్గావాణి, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, మండల అధ్యక్షులు నడకుదిటి జనార్ధనరావు, బొబ్బర్లంక గ్రామ సర్పంచ్ గంగా భవాని, దొప్పలపూడి జగదీష్, జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ నేతలు గొర్రెపాటి రామకృష్ణ, రావి నాగేశ్వరరావు, అయినంపూడి బానుప్రకాష్, రావి రత్నగిరి, కోనేరు చంద్రమౌళి, చల్లపల్లి మండల అధ్యక్షులు మోర్ల రాంబాబు, తెలుగు మహిళ జిల్లా నేతలు పైడిపాముల కృష్ణకుమారి, దివి యుగంధరి, మాజీ ఎంపీపీ మోర్ల జయలక్ష్మి, చందన రంగారావు, సర్పంచ్ దిడ్ల జానకీ రాంబాబు, రైతులు బాల భార్గవ్, కల్లేపల్లి రమేష్, కోటేశ్వరరావు, బాల సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

లీగల్ నోటీసు
మహారాజశ్రీ బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జి
ఓ.యస్.నెం : 71/2022

బిట్వీన్ :
పాదర్తి సుజాత - వాది
మరియు
కంతేటి నాగాంజనేయులు మరియు 4 అదర్స్ - ప్రతివాదులు

పై పార్టీషన్ దావానందు **2వ ప్రతివాది** కనగళ్ల సుశీల వగైరాలపై దావా దాఖలు చేసివున్నది. శ్రీకోర్టువారు చాలాసార్లు దావా సమన్లు పంపిపనూ 2వ ప్రతివాదికి జారీ కానందున శ్రీకోర్టువారి ఆదేశాల మేరకు సదరు పై దావా వాయిదా **ది.14-06-2023**కు వున్నది. కావున మీరు గాని, మీ తరపు న్యాయవాదిగాని ఆరోజు **ఉదయం 10.30**గం॥ల నుండి పై కోర్టు నందు హాజరై తమ ఆక్షేపణలు తెలియజేయుగలరు. అట్లు లేని యెడల తమకు పరోక్షముగా ఉత్తర్వులు జారీ కాబడగలవని యిందుమూలముగా తెలియపరచటమైనది.

బంటుమిల్లి,
5-6-23

పల్లెం వీరవెంకటేశ్వరరావు,
బి.కాం. బి.ఎల్.,
సెల్ : **9848525456**

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

దేశ గౌరవం, మహిళల ఆత్మాభిమానం కన్నా

బీజేపీకి రాజకీయ ప్రయోజనమే మిన్న

రెజ్లర్లకి సంఘీభావ సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు

విశాలాంధ్ర ఇబ్రహీంపట్నం : మన దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెడుతున్న మహిళా మల్లయోధులపై లైంగిక వేధింపులకు పాల్పడి వారి ఆత్మ గౌరవాన్ని తీవ్రంగా దెబ్బతీసిన బీజేపీ ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షులు, కామాంధుడైన బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ పై కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, మౌనం వహించడాన్ని పరిశీలిస్తే దేశ గౌరవం, మహిళల ఆత్మాభిమానం కన్నా బీజేపీకి రాజకీయ ప్రయోజనమే ముఖ్యం అనేది సమాజానికి సుస్పష్టమవుతున్నదని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. భారత మహిళ మల్లయోధులు సాగిస్తున్న ఆత్మగౌరవ పోరాటానికి సంఘీభావంగా మైలవరం నియోజకవర్గం ఇబ్రహీం పట్నం, జి. కొండూరు మండలాలలో సీపీఐ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సభలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బీజేపీ అధికారాన్ని చేపట్టిన తొమ్మిదేళ్లలో అన్ని పాలనా వ్యవస్థలను తన రాజకీయ ప్రయోజనాలకు అనుకూలంగా మార్చుకొని, తన రాజకీయ ప్రత్యర్థులపై దాడులు, దౌర్జన్యాలు, కేసులు, అరెస్టులు, జైల్లో పెట్టి హింసించి భయభ్రాంతులకు గురి చేస్తూ, రాచరిక పాలన చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి రెజ్లింగ్ క్రీడారంగంలో శిక్షణ పొంది, దేశానికి పథకాలను సాధించి పెడుతూ ప్రపంచవ్యాప్తంగా మన దేశ ప్రతిష్టను మడింపజేస్తున్న మన మహిళా మల్లయోధులు తప్పనిసరి పరిస్థితులలో ఆత్మ గౌరవాన్ని చంపుకోలేక దేశ రాజధాని నడిబొడ్డున రోడ్డెక్కి అయ్యా మాకు న్యాయం చేయమని ఆందోళనకు దిగారని తెలిపారు. కామాంధుడైన బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేసి చట్ట పరిధిలో చర్యలు తీసుకోమని గగ్గోలు పెడుతున్నా పట్టించుకోకపోగా, అందుకు విరుద్ధంగా మహిళలను నడిరోడ్డుపై ఈడ్చి లాఠీ చార్జి జరిపి పోలీస్టేషన్లో కుక్కటం నియంత పాలనకు నిదర్శనం కాదా అని కోటేశ్వరరావు ప్రశ్నించారు. ఎట్టకేలకు కేసులు బుక్ చేసి తయారు చేస్తున్న ఎఫ్ ఐ ఆర్ లలో నిజాలు భయపడుతున్నాయని, తక్షణమే ఆ దుర్మార్గుడిని అరెస్ట్ చేసి జైలుకు పంపి విచారణ జరిపితే అసలైన నిజాలు బయటికి వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మైలవరం నియోజకవర్గ కార్యదర్శి బుడ్డి రమేష్ కేంద్ర ప్రభుత్వం ఫాసిస్ట్ పాలనను తీవ్రంగా విమర్శిస్తూ, బీజేపీని మరోసారి అధికారంలోనికి రానీయకుండా తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ప్రజాసంఘాల నాయకులు జి శ్రీనివాసరెడ్డి, కే వెంకటేశ్వరరావు, రాము, చింతయ్య, నాగరాజు, సుభాని, దావీదు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర జలశక్తి మిషన్ కార్యదర్శి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు : కలెక్టర్ ఢిల్లీరావు

విశాలాంధ్ర-మైలవరం: ఈనెల 6వ తేదీన కేంద్ర జల శక్తి మిషన్ కార్యదర్శి విని మహాజన్ పర్యటన సందర్భంగా జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆదివారం ఇబ్రహీంపట్నం మండలం జూపూడి, మైలవరం మండలం పొందుగల గ్రామాలలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీ రావు మాట్లాడుతూ కేంద్ర జలశక్తి మిషన్ కార్యదర్శి విని మహాజన్ ఈనెల 6వ తేదీ జిల్లాలోని జూపూడి, పొందుగల గ్రామాలలో పర్యటించనున్నారన్నారు, ముందుగా జూపూడిలో గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ పనితీరు, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు (సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్) పొందుగల గ్రామంలో సురక్షిత త్రాగునీరు, డ్రైనేజ్, పారిశుధ్య వ్యవస్థ పనితీరు తదితర అంశాలను సందర్శించనున్నారు. కేంద్ర జలశక్తి కార్యదర్శి ఆయా గ్రామాల్లో పర్యటించే సందర్భంలో పారిశుధ్య, సురక్షిత మంచినీరు లభ్యత అంశాలు, సచివాలయ ఉద్యోగులతో ముఖాముఖిగా మాట్లాడతారని చెప్పారు. ఆయా గ్రామాల్లో కేంద్ర నిధులతో చేపట్టిన పథకాల కార్యక్రమాల నివేదికను తయారుచేసి సిద్ధంగా ఉంచుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు ఆదేశించారు. ఏర్పాట్ల పరిశీలనలో కలెక్టర్‌తో పాటు జిల్లా పంచాయతీ అధికారి జే సునీత తదితరులు ఉన్నారు.

ఏరువాక పౌర్ణమి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా పానకం కావిల్లు ఆలయ అర్చకులు వేద పండితులు పురోహితులు విశేష పూజలు చేశారు. ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ధర్మకర్తలు కోలా రామారావు, ఆదిమూలం నరసింహారావు, ఆలయ అధికారుల సమక్షంలో ఘనంగా ప్రారంభమైనాయి.

ముగిసిన ఆందోళన

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో శనివారం సాయంత్రం ఆరంభమైన ఆందోళన ఎట్టకేలకు అర్ధరాత్రి సమయానికి ముగిసింది. విస్సన్నపేటకు చెందిన పిట్టల సాంబశివరావు, ఆకుల నాగరాజులు ద్విచక్రవాహనంపై వస్తుండగా, కారు ఢీకొనటంతో సాంబశివరావు మృతి చెందారు. ఆకుల నాగరాజు తీవ్రగాయాలకు గురవ్వగా, విజయవాడలో చికిత్స పొందుతున్నారు. వీరికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సాయంత్రం బాధిత కుటుంబాలకు చెందినవారు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. వీరి వాహనాన్ని ఢీకొన్న కారు యజమానికి రాజకీయ అండదండలు ఉన్నాయని, పోలీసులు నిందితుని కాపాడే యత్నం చేస్తున్నారని ఆందోళనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరువూరు సీఐ భీమరాజు ఆందోళనకారులతో చర్చించి, నిందితులపై చర్యలు తీసుకుంటామని, బాధితులకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీ మేరకు ఆందోళన ముగిసింది.

భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలి

విశాలాంధ్ర-విజయవాడ : గాలి, భూమి, నీరు, ఆకాశం, అగ్ని వంటి ప్రకృతి వనరులను కాపాడుకోవడంతో పాటు మన పూర్వీకుల నుంచి మనకు లభించిన పర్యావరణ స్థితిని మనం కూడా మన తర్వాతి తరాలకు అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలని ఆంధ్ర ప్రదేశ్ అటవీ, పర్యావరణం, శాస్త్ర, సాంకేతిక విభాగాల ప్రత్యేక కార్యదర్శి పి. చలపతిరావు అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ విద్యాసాగర్ ఆధ్వర్యంలో కొండపల్లి ఖిల్లాపై గత కొన్ని సంవత్సరాలుగా పేరుకుపోయిన చెత్త, చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న చలతిరావు మాట్లాడుతూ ప్రకృతి పరంగా మనం అనుభవిస్తున్న వనరులు విచ్చలవిడిగా వినియోగిస్తే భవిష్యత్ తరాలు పరిశుభ్రమైన గాలి, నీరు పొందలేరని పేర్కొన్నారు. ప్రకృతిలో భాగమైన వృక్షాలను సంరక్షించడం ద్వారా పరిశుభ్రమైన గాలి అందరికీ లభిస్తుందన్నారు. అలాగే సకాలంలో వర్షాలు పడాలన్నా వృక్ష సంపదను కాపాడుకోవాలన్నారు. భూమి ఆవిర్భావం నుంచి ఒక సమయానుక్రమణిక ద్వారా భూమిపై ప్రకృతి వనరులు మనిషికి కావలసిన ఎన్నో అవసరాలను నిస్వార్థంగా తీరుస్తున్నాయన్నారు. సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న వ్యాపార ధోరణి వల్ల ఎక్కువగా నష్టపోతోంది ప్రకృతి వనరులేనన్నారు. ఇటువంటి విపత్కర పరిస్థితులను అధిగమించి ప్రతి ఒక్కరూ ప్రకృతి పరిరక్షణ కోసం సామాజిక బాధ్యతగా ప్రకృతి వనరులను కాపాడుకోవాలన్నారు. నిత్యం బిజీగా ఉండే ప్రభుత్వ ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు ఇటువంటి కార్యక్రమంలో పాల్గొనటం స్ఫూర్తిదాయకమని, ఏపీ ఎన్జీవోస్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు మునుముందు కూడా ఇటువంటి కార్యక్రమంలో భాగస్వామి ఊహిస్తూ ప్రజలందరినీ భాగస్వామ్యులు చేయడానికి కృషి చేయాలని కోరారు. జిల్లా అటవీ శాఖ అధికారి అప్పన్న మాట్లాడుతూ ఇటువంటి ప్రక్షాళన కార్యక్రమాలు ప్రతి చారిత్రక ప్రదేశంలో జరగాలన్నారు. మన రాష్ట్రంలో ఎన్నో చారిత్రాత్మక ప్రాంతాలలో పర్యావరణాన్ని కాపాడుకోవడం కోసం స్వచ్ఛంద సంస్థలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని చెప్పారు. ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ మాట్లాడుతూ సామాజిక సేవ అనే పదానికి ఉన్న అర్థం ప్రకృతి వనరులను కాపాడుకోవడమేనని చెప్పారు. ముఖ్యంగా ప్రకృతి పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న వృక్షాలను పరిరక్షించడంతో పాటు ప్రతీఒక్కరు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవాలన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులతో ప్రకృతిని పరిరక్షిస్తామని ముఖ్య అతిథులు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రక్షాళన కార్యక్రమంలో వందలాది మంది ఉద్యోగులు కొండపల్లి ఖిల్లా నుంచి ఘాట్ రోడ్డు వరకు ఉన్న వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ అడ్వెంచర్స్ క్లబ్ రఘునాథ రెడ్డి, కొండపల్లి ఖిలా కమిషనర్ సాంబశివరావు, ఏపీ ఎన్జీవో ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎండి ఇక్బాల్, భద్రత బాధ్యత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ఎస్. శ్రీనివాసరావు, జిల్లా ఎన్జీవో నాయకులు సతీష్ కుమార్, శ్రీ రాజబాబు, రామకృష్ణ, విశ్వనాథ్, విజయవాడ నగర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరామ్, సంపత్ కుమార్, యూత్ హాస్టల్ అసోసియేషన్ కార్యదర్శి మల్లి తదితరులతో పాటు వందలాదిమంది ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతులకు కలెక్టర్ ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు

విశాలాంధ్ర-విజయవాడ : భారతీయ సంస్కృతికి , జీవన విధానానికి మూలస్తంభం లాంటిది వ్యవసాయం. దానికి తొలి పనిముట్టు నాగలి , ముఖ్యవనరు వర్షం. ఆ వర్షం కురిసే కాలం మొదలయ్యేప్పుడు పండుగ లిఏరువాక పున్నమి రైతులకు వ్యవసాయంలో సిరిసంపదలు అందజేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీ రావు రైతులకు ఆదివారం ఒక పకటనలో శుభాకాంక్షలు తెలిపారు. రైతులు వ్యవసాయానికి ఆలంబన అయిన పశు సంపద , భూమి , పనిముట్లకు ప్రాధాన్యమిచ్చి పూజించడం ఈ పూర్ణిమ ప్రత్యేకతని పేర్కొన్నారు. నాగలిని శుభ్రపరచి , పసుపు , కుంకుమలతో అలంకరించి వాటితో వ్యవసాయ భూమికీ పూజచేస్తారని తెలిపారు. పశువుల కొట్టాలు , కళ్ళాలు మొదలైనవాటినీ శుభ్రం చేస్తారని నాగలిని పూజించి , పశువులను , బళ్లను మేళతాళాలతో ఊరేగించి రైతులు భూమిలో తొలి వ్యవసాయ పని ప్రారంభించే ఏరువాక పున్నమి రైతుల జీవితాలలో వెలుగు నిపాలని జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీ రావు ఆకాంక్ష తెలిజేశారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి ద్వాదశ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : స్థానిక చిట్టినగర్లో వేంచేసివున్న శ్రీ పద్మావతి గోదాదేవి సమేత గరుడాచల స్థితి వేంకటేశ్వరస్వామి వార్ల పుష్కర (12 వ) బ్రహ్మోత్సవాలు ఆదివారం ఉదయం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మీ అమ్మవార్ల దేవస్థానం కమిటీ అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, గౌరవ అధ్యక్షులు బెవర సూర్యనారాయణ,కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్ళా శ్రీనివాసరావు తదితర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం సహస్ర కలశ యాత్ర భక్తులచే ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పవిత్ర కృష్ణా నది నుండి పవిత్ర జలాలను తీసుకువచ్చి అనంతరం స్వామివారిని పెండ్లి కుమారుని చేసే కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ బ్రహ్మోత్సవాల్లో కమిటీ ఉపాధ్యక్షులు మరుపి ళ్ళ సత్యనారాయణ, బెవర శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి పోట్నూరి దుర్గాప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొరగంజి భాస్కరరావు కార్యవర్గ సభ్యులు ఈది ఎల్లారావు, తమ్మిన సూర్యకుమారి, కామందుల నరసింహారావు, బంక హనుమంతరావు, ఈది ఎల్లా రాజారావు, పోతిన వెంకట ధర్మారావు, గూడేల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ వీజీఆర్‌కు ఎన్టీఆర్ శత జయంతి పురస్కారం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ప్రముఖ చలనచిత్ర నటుడు, పద్మశ్రీ బ్రహ్మానందం చేతులు మీదుగా నటసార్వభౌమ డాక్టర్ ఎన్టీఆర్ శతాబ్ది పురస్కారం అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని విజయవాడ మొగల్రాజపురానికి చెందిన ప్రముఖ మధుమేహ వ్యాధి వైద్య నిపుణులు వేణుగోపాల రెడ్డి(వీజీఆర్) ఒక ప్రకటనలో అన్నారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఇటీవల తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ శతాబ్ది పురస్కారాన్ని స్వీకరించినట్లు తెలిపారు. ఒక మహానటుడు పేరుతో ఏర్పాటు చేసిన ఇటువంటి పురస్కారాలు పొందినప్పుడు వృత్తిపరంగా మరింత బాధ్యతగా పనిచేయాలనే మానసిక శక్తి పెరుగుతుందన్నారు. గడచిన రెండు దశాబ్దాలుగా మధుమేహ వ్యాధి నివారణకు విద్యాసంస్థల్లో దాదాపు 10లక్షల మంది విద్యార్థులకు అవగాహన కల్పించడం, నాలుగు వేల అవగాహన వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి లక్షలాది మందికి మధుమేహ వ్యాధి బారినుండి ఏ విధంగా బయటపడొచ్చనే దానిపై పూర్తిస్థాయి అవగాహన కల్పించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ పర్యటించి వ్యాధి నివారణ కోసం విశేషంగా కృషి చేయడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేయడం వంటి కార్యక్రమాల నిర్వహణ, వ్యాధి నియంత్రకు సంబంధించి రూపొందించిన డాక్టర్ వీజీఆర్ డయాబెటిస్ పుస్తకాలను రెండు తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 8లక్షల మందికి ఉచితంగా అందజేయడం ద్వారా తనకు ఎన్టీఆర్ సెంటినరి పురస్కారం లభించినట్లు డాక్టర్ వీజీఆర్ తెలిపారు.

మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకుంది

విశాలాంధ్ర-కంచికచర్ల: రాష్ట్రంలో ఉన్న పేద ప్రజల అభ్యున్నతి కోసం టిడిపి జాతీయనాయకులు ద్విరాష్ట్రాల మాజీముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన మేనిఫెస్టో చరిత్రలో నిలిచి పోతుందని రాష్ట్రమాజీ మంత్రి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమా మహేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్ర మాజీమంత్రి దేవినేని వెంకటరమణ ప్రణీతల 24వ వర్ధంతిని పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే తంగిరాలసౌమ్యతో కలసి ఆదివారం ఉమా పార్టీకార్యాలయానికి విచ్చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో చంద్రబాబునాయుడు చిత్రపటానికి మాజీ మంత్రి ఉమా మాజీ ఎమ్మెల్యే సౌమ్య టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు కోగంటి బాబు ఇతరనాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ఆడపడుచుల కోసం, రైతన్నల కోసం ,నేటి యువత కోసం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం చంద్రబాబు నాయుడు విడుదల చేసిన మేనిఫెస్టో చూస్తుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే కాక వారి నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని యాద్దవ చేశారు. నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు చేయూత నిచ్చే విధంగా ఈ మేనిఫెస్టోను రూపొందించడం జరిగిందన్నారు. రేపు వచ్చే దసరాకి విడుదల చేయ బోయ మేనిఫెస్టో వైసీపీ నాయకులకు దిమ్మతిరిగిపోయే విధంగా ఉంటుందని ఆమె అన్నారు. రాష్ట్రంలో 2024 సంవత్సరంలో టిడిపి అధికారంలో రావడం ఖాయమని ముఖ్యమంత్రి పీఠాన్ని చంద్రబాబు నాయుడు అధిరోహించడం ఖాయమని సౌమ్య తెలిపారు.

దేవినేని వెంకట, దేవినేని రమణ వర్ధంతి

విశాలాంధ్ర-నందిగామ: దేవినేని రమణ 24వ వర్ధంతి ని పురస్కరించుకొని నందిగామ పట్టణం గాంధీ సెంటర్ లో దేవినేని వెంకట రమణ, తంగిరాల ప్రభాకర రావు విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వర రావు, మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య టీడీపీ శ్రేణులు. అనంతరం గాంధీ సెంటర్‌లో అన్నసమారాధన కార్యక్రమాన్ని దేవినేని ఉమామహేశ్వరరావు, తంగిరాల సౌమ్య ప్రారంభించి వెంకటరమణ నియోజకవర్గానికి చేసిన పలు రకాల అభివృద్ధి పనులు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు యే చూరు రాము, వడ్డెల్లి సాంబశివరావు, కాసర్ల లక్ష్మీనారాయణ, నెలకొదిటి నాగేశ్వరరావు, శా కమూరి సరోజిని, స్వర్ణలత సత్యవతి కోటేశ్వరమ్మ, ఇంటి మాల ప్రవీణ,లక్ష్మీ కుమారి,శ్రీనివాసరావు, పలు గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలో దేవినేని వెంకటరమణ 24వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు, జొన్నలగడ్డ, సోమవరం ,పల్లగిరి, కంచల, తొర్రగుడుపాడు పలు గ్రామాలలో నాయకులు మన్నే కళావతి, ఉ ప్పుకుండూరు గురు ప్రసాద్, షాబ్జన్, చెరుకూరు హైమారావ్, వేల్పుల బిక్షాలు, ము క్కపాటి నాగయ్య, చెరుకూరు సాంబశివరావు, వీరంకి వీరాస్వామి, గోనెపల్లి చిన్న నాగేశ్వరావు, షేక్ కరీముల్లా, అంకమ్మరావు, ఇంటూరి సీతయ్య, ఉప్పు వెంకటేశ్వర్లు నాయకులు కార్యకర్తలు ఆయా గ్రామాలలో దేవినేని వెంకటరమణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు

దేవినేని రమణకు ఘన నివాళులు

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : దేవినేని వెంకటరమణ 24వ వర్ధంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జంపాల సీతారామయ్య ఘన నివాళులు అర్పించారు. ఇబ్రహీంపట్నంలోని సహాయ మాత స్కూలులోని విద్యార్థులతో కలసి దేవినేని వెంకటరమణ ప్రణీతలకు నివాళులు అర్పించి విద్యార్థులకు బిస్కెట్లు చాక్లెట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు రామినేని రాజశేఖర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ శాసనసభ్యునిగా, మంత్రిగా అతి తక్కువ కాలంలో ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన నేత దేవినేని రమణ అని అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ మహబూబ్ సుభాని, కూచిపూడి దిలీప్ కుమార్, ప్రభాకర్, భయ్యా రామోజీ, వల్లూరు జనార్దన స్వామి దాస్, కోటేశ్వరరావు, జమస్, జ్యోతిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 33 కేవీలైన్ తొలగింపు శంకుస్థాపన.

విశాలాంధ్ర-కంచికచర్ల : వసంత కాలనీ ప్రాంత ప్రజల మూడు దశాబ్దాల కోరిక తీరేందుకు నేడు ఎమ్మెల్యే శంకుస్థాపన చేయ నున్నారు. వసంత కాలనీ నిర్మాణానికి ముందు వీరులపాడు వైపు నుండి కంచికచర్ల సబ్ స్టేషన్ వరకు 33 కెవి విద్యుత్తు లైన్ ఏర్పాటు చేశారు. అనంతరం వసంత కాలనీ ప్రాంతంలో ప్రభుత్వం ద్వారా ఇల్లు లేని పేదలకు నివేశ స్థల పట్టాలు మంజూరు చేయడంతో అక్కడ ఒక కాలనీ అభివృద్ధి చెందింది. కానీ 33 కెవి విద్యుత్ లైన్ కారణంగా ఆయా లైన్ క్రింది భాగంలోని ఇళ్ల నిర్మాణాలు చేసిన యజమానులు అప్పటినుండి అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందిన వారు పదుల సంఖ్యలో ఉంటే క్షతగాతులైనవారు అంతకంటే ఎక్కువ ఉన్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వాలు మారిన ప్రతిసారి కాలనీవాసులు ఈ విద్యుత్ లైన్ తొలగించేందుకు ప్రభుత్వానికి అర్జీలు పెట్టుకున్నప్పటికీ నేటి వరకు పరిష్కారం లభించలేదు. స్థానిక ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావు, ఎమ్మెల్సీ అరుణ్ కుమార్ స్థానిక నాయకులతో కలిసి వసంత కాలనీ ప్రజలు పడుతున్న ఇబ్బందులను విద్యుత్ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా దీనికి పరిష్కారం లభించింది.సుమారు 90 లక్షల అంచనా వ్యయంతో విద్యుత్ శాఖ నిధులతో ఈ 33 కెవి విద్యుత్ లైన్ తొలగించేందుకు నేడు ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నారు.

కేంద్ర మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్‌కు ఘన స్వాగతం

విశాలాంధ్ర-విజయవాడ : గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆదివారం హైదరాబాదు నుండి విజయవాడ చేరుకున్న యూనియన్ మినిస్టర్ ఆఫ్ స్టేట్ ఫర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ కు నోవాటెల్ హోటల్ వద్ద జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. యం సుహాసిని స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి 4, 5వ తేదీ లలో గుంటూరు జిల్లాలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. 6వ తేదీ మంగళవారం ఉదయం 9:30 గంటల నుండి 10 గంటల వరకు ఎన్టీఆర్ జిల్లాలోని జి. కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి ప్రధానమంత్రి మాతృ వందన యోజన లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహిస్తారు. అనంతరం 10 గంటల 45 నిమిషాల నుండి మధ్యాహ్నం 12 గంటల 15 నిమిషాల వరకు ఏ. కొండూరులో ఎమ్ఎస్ఎంఈ, కిసాన్, టిడ్కో లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహిస్తారు. అనంతరం డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించి విలేకరుల సమావేశంలో పాల్గొంటారు. 7వ తేదీన నగరంలో చాంబర్ ఆఫ్ కామర్స్ బిజినెస్ పర్సన్స్ తో సమావేశం జాతీయ ప్రాజెక్టుల పరిశీలన చేస్తారు.

శాస్త్రోక్తంగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ ఆలయంలో శోభకృత్ నామ సంవత్సరం పౌర్ణమి పురస్కరించుకుని ఆదివారం ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో మధ్య సాగింది. దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డు ప్రారంభంలోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభమైన గిరి ప్రదక్షిణలో మందలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. అరుణాచల క్షేత్రము తరహాలో ప్రతి పౌర్ణమికి ఇక్కడ కూడా గిరి ప్రదక్షిణ చేయ్యడం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దుర్గగుడి పాలక మండలి ఛైర్మన్ కర్నాటి రాంబాబు, ఈబో భ్రమరాంబ, స్థానాచార్యులు, పాలక మండలి సభ్యులు, దుర్గగుడి అధికారులు పాల్గొన్నారు.

అవారలో ప్రతిదినం పర్యావరణ దినమే

విశాలాంధ్ర-విజయవాడ : రేపటి ప్రపంచ పర్యావరణ దినం సందర్భంగా ఆదివారం వేకువనే పలువురు చిన్నారులు వారి తల్లిదండ్రులతో కృష్ణనదీ తీరాన చేరి, 2కిమీ ఇసుకతిన్నెలపై పరుగు, నదీ నిడివి ఈతలో పాల్గొన్నారు. ఆట, పాటలతో సాగిన ఈ కార్యక్రమానికి అందరినీ ఆహ్వానిస్తూ ప్రముఖ పర్యావరణవేత్త, అవార వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ అజయ్ కాట్రగడ్డ మాట్లాడుతూ ప్రతి రోజూ మనకిక్కడ పర్యావరణ దినమే అన్నారు. పర్యావరణం అనేది నిరంతర ప్రయాస అనీ, ఏదో ఒక రోజుతో చేతులు దులుపుకొనే ప్రహసనం కాదన్నారు. మహిళా, శిశు ఈత శిక్షకురాలు శకుంతలాదేవి, ప్రాణ రక్షక్ పంకజ్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో అవార సభ్యులు, ఈతగాళ్లు వెంకటేష్, వాసుదేవరావు, సీతామహాలక్ష్మి, రాధిక, భవాని, మధు, హృత్విక్, జాషువా, జాన్, అభిషయ్, అవీష్, మౌక్తిక, మానవిక, మిషీక, చంద్రచూడ్, విజయ్, గోకుల్, మురళి, సునీల్ పాల్గొన్నారు.

ఇష్టంతో చదివితే సివిల్స్ ర్యాంకు సాధించవచ్చు

విశాలాంధ్ర-విజయవాడ ఎడ్యుకేషన్ : తాను డాక్టర్ అయినప్పటికీ ఐఏఎస్ అధికారిగా మంచి సేవలు అందించగలననే దృఢ సంకల్పంతో కష్టపడి, ప్రణాళికా బద్ధంగా చదివానని అందుకే అలిండియా ర్యాంకు సాధించానని.. కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే సివిల్స్‌లో విజయం సాధించడం సులువు అని యుపిఎస్సి సివిల్స్ సర్వీసెస్ ఆలిండియా 22వ ర్యాంకర్ పవన్ దత్త అన్నారు. ఎం.జి. రోడ్డులోని శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమిలో ఆదివారం విద్యార్థులతో సివిల్స్ 22వ ర్యాంకర్ పవన్నాయి దత్త "ఇష్టాగోష్టి నిర్వహించారు. ఈసందర్భంగా ఐఏఎస్ ర్యాంకర్ పవర్ దత్త మాట్లాడుతూ మనం సాధించాలనుకునే కలలను కని, ఇష్టంతో చదివితే సివిల్స్ తొలి ప్రయత్నంలోనే మంచి ర్యాంకు సాధించవచ్చని తెలిపారు. శరత్ చంద్ర ఐఏఎస్ ఆకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ తోట శరత్ చంద్ర మాట్లాడుతూ 2021 లో కోవిడ్ వలన కొన్ని నెలలు వృధా అయినప్పటికి మనోధైర్యంతో పవన్ దత్త ఆరు నెలలు మాత్రమే కష్టపడినప్పటికీ ఐఏఎస్ ర్యాంక్ సాధించాడన్నారు.

వేణుగోపాలస్వామి మాస కల్యాణం.

విశాలాంధ్ర-గంపలగూడెం : వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో ఆదివారం రుక్మిణి, సత్యభామ సమేత, వేణుగోపాల స్వామి వారి మాస కళ్యాణం ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి. గోపాలచార్యులు వేద మంత్రాలతో ఘనంగా నిర్వహించారు. 11 మంది దంపతులు పీటల పై కూర్చుని కన్యాదానం గావించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కావూరి. శశిరేఖ ,బోర్డు సభ్యులు నూకల. నాగ లక్ష్మణరావు ,ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దేవాలయంలో కోనేరు నిర్మాణానికి తెలంగాణ రాష్ట్రం, ఉప్పల్ కు చెందిన వద్దిరాజు. మన్మధరావు లక్ష రూపాయలు విరాళంగా దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కావూరి .శశిరేఖ కు అందజేశారు . దాతకు స్వామివారి దర్శనం అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి .గోపాలచార్యులు వేద ఆశీర్వచనం జేసి, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యులు నూకల. నాగ లక్ష్మణరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.